# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 07-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**
2. **బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు చివరి దశకు చేరుకున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
3. **విజయవాడ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలపై ఇంటింటి సర్వేకు ఒక యాప్‌ను రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసింది.**
4. **వరద ముంపు గ్రామాల్లో సహాయక కార్యక్రమాల నిర్వహణ కోసం ఆరు ప్రత్యేక బృందాలను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ నియమించింది.**
5. **ఖరీఫ్ పంటకాలానికి జిల్లాలవారీగా ఎంపికచేసిన పంటలకు ఉచితంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను అమలు చేయనున్నామని వ్యవసాయశాఖ సంచాలకులు ఎస్.దిల్లీరావు తెలిపారు.**

==========================

దేశ వ్యాప్తంగా వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. వినాయకచవితి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

మరోవైపు రాష్ట్రంలోని పలు వినాయకుని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానంలో ఈరోజు నుంచి వినాయక చవితి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ బ్రహోత్సవాల్లో భాగంగా ఈరోజు రాత్రి మూషిక వాహన సేవను నిర్వహించనున్నారు.

--------------------------

బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు చివరి దశకు చేరుకున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో మంత్రి ఈ రోజు మాట్లాడుతూ, భారత సైన్యం సహాయంతో గండ్లు పూడ్చివేసి దిగువకు వెళ్తున్న వరదను అడ్డుకుంటామన్నారు. బుడమేరు వరద నుంచి విజయవాడ ప్రజలకు రక్షణ కల్పిస్తామనితెలిపారు. గండ్లు పూడ్చివేత పనులు పూర్తి అయ్యేంతవరకు అక్కడే ఉండి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి వివరించారు.

మరోవైపు విజయవాడలోని వరద ముంపు ప్రాంతాలకు నిత్యావసర సరుకులను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. మూడు రోజుల్లో అందరికీ అందజేసే లక్ష్యంతో పంపిణీ సాగుతోందని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలపై ఇంటింటి సర్వేకు ఒక యాప్‌ను సిద్ధంచేశారు. వరద ప్రభావంతో జ్వరాలు, జలుబు, దగ్గు, గాయాలు, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడిన వారి వివరాలు సేకరించనున్నారు. రేపటి నుంచి ఈ సర్వే ఆరంభించనున్నారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజల కోసం సిద్ధంచేసిన 75 వేల మెడికల్ కిట్లలో గత రెండు రోజుల్లో 50 వేలకు పైగా ఇంటింటికీ పంపిణీ చేశారని రాష్ట్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ వెల్లడించారు. 149 సచివాలయాల పరిధిలోనూ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

---------------------------

వరద ముంపు గ్రామాల్లో సహాయక కార్యక్రమాల నిర్వహణ కోసం ఆరు ప్రత్యేక బృందాలను నియమిస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ తెలిపింది. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఇతర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ బృందాలు పనిచేయనున్నాయని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలతో పాటు రక్షిత మంచినీటి సరఫరా, రోడ్లకు మరమ్మతులు వంటి పనులను వేగవంతం చేసేలా ఈ బృందాలు పని చేయనున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

ఖరీఫ్ పంటకాలానికి జిల్లాలవారీగా ఎంపికచేసిన పంటలకు ఉచితంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను అమలు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ సంచాలకులు ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఈ-పంటలో నమోదైతే పంటల బీమా వర్తిస్తుందని.. రైతు వాటాగా చెల్లించాల్సిన ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఒక ప్రకటనలో వివరించారు. రబీ నుంచి పంటల బీమా కావాలంటే.. రైతులే తమ వాటా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆహార ధాన్యాలు, నూనెగింజల పంటలకు 1.5 శాతం, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5శాతం చొప్పున ప్రీమియం చెల్లించాలని సూచించారు.

---------------------------

విశాఖ రైల్‌నీర్ ప్లాంట్ నుంచి విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు తాగునీరు అందించాలని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోరారు. ఈ మేరకు ఆమె కేంద్రమంత్రికి లేఖ రాశారు. విజయవాడ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి సమయం పడుతుందని, ప్రత్యామ్నాయంగా రైల్‌నీర్ నుంచి త్రాగునీరును సరఫరా చేయాలని షర్మిల లేఖలో పేర్కొన్నారు.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

పోషకాహార లోపాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా మహిళా,

శిశు సంక్షేమ శాఖ సంచాలకులు బి.సుజాత రాణి తెలిపారు. జిల్లాలోని మొగల్తూరులో నిన్న అంగన్వాడి కార్యకర్తలతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగంగా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ వరకు పోషక మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వయం సంఘాలను భాగస్వామ్యం చేస్తూ పోషకాహార లోపాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

---------------------------

గిరిజనుల అభివృద్ధికి ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్-జన్‌మన్ పథకం దోహదపడుతుందని ప్రకాశం జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జగన్నాధరావు తెలిపారు. జిల్లాలోని దోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో జన్‌మన్ పథకంపై నిన్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ, ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా పక్కా గృహాలు, ప్రతి ఇంటికీ నీటి కొళాయి ఏర్పాటు, గ్రామాలకు రహదారుల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, విద్య, వైద్యం, పౌష్టికాహారం వంటి సేవలు గిరిజనులకు అందుతాయని తెలిపారు. స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని వివరించారు.

---------------------------

అల్పసంఖ్యాక వర్గాలకు మన భారత్‌లో లభించినంత రక్షణ మరే దేశాలోనూ కనిపించదని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. విశాఖపట్నంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మైనార్టీలకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. దేశంలో 10 కోట్ల మంది మైనార్టీలను పార్టీ సభ్యులుగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదును చేపట్టామని తెలిపారు.

---------------------------

గిరిజన గ్రామాల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై సమగ్రమైన సర్వేను నిర్వహించనున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ – ఐటీడీఏ పథక సంచాలకులు వి. అభిషేక్ తెలిపారు. నిన్న పాడేరులో ఐటీడీఏ అధికారులతో సర్వే నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, అంతర్గత రహదారులు, పాఠశాలలు, వైద్య సేవలు, గిరిజనుల ఆర్థిక స్థితిపై యాప్ ద్వారా సమగ్రమైన సర్వే నిర్వహించి నివేదికలో సమర్పించాలని తెలిపారు. గబ్బంగి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా ముందుగా సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు.

---------------------------

అలిపిరి మెట్లమార్గంలో తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు త్వరలో దివ్యదర్శనం టోకెన్ల జారీని పునరుద్ధరించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామలారావు తెలిపారు. తిరుమలలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అలిపిరి రాజగోపురం వద్ద దివ్యదర్శన టోకన్ల జారీ, గాలిగోపురం వద్ద టోకెన్ల స్కానింగ్ కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆధార్ ధృవీకరణకు కేంద్ర ప్రభుత్వం నుండి టీటీడీకి ప్రాథమికంగా అనుమతి లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా త్వరలో పూర్తిస్థాయి అనుమతులు వచ్చాక... ఆధార్ ధృవీకరణతో పారదర్శకంగా భక్తులకు దర్శనం, గదులు కేటాయిస్తామన్నారు.

---------------------------

నేటి సమాజంలో యువతను సన్మార్గంలో నడిపించడానికి ఆధ్యాత్మిక గ్రంధాలు దోహదపడతాయని దానిలో భాగంగానే ఆకాశవాణి విజయవాడ కేంద్రం నుంచి భగవద్గీత పారాయణం ఈ రోజు నుంచి ప్రతిరోజు ప్రసారం అవుతుందని కార్యక్రమ విభాగాధిపతి బి. వేంకటేశ్వర్లు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 7 గంటల 15 నిమిషాల నుంచి 7 గంటల 20 నిమిషాల వరకు 700 శ్లోకాలు, 700 రోజులు పాటు భగవద్గీత పారాయణం అవిశ్రాంతంగా ప్రసారం అవుతుందన్నారు. భగవద్గీత గానం, వ్యాఖ్యానం నిలయ విద్వాంసులు మల్లాది శ్రీరామ ప్రసాద్ అందిస్తారని, ఈ కార్యక్రమం ప్రసారణ అధికారి డాక్టర్ చుండూరు మాణిక్య రావు నిర్వహణలో ప్రసారం అవుతుందని తెలియజేశారు.

======================